




బహు రూపాయ గణేశాయ

పెంటపాడు మండలం అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద ఆభరణ భూషితుడిగా చతుర్భుజుడై త్రిశూలం చేతబట్టి ప్రసన్నవదనంతో భక్తుల పూజలందుకుంటున్నాడు.

ముదినేపల్లి మండలం దేవపూడిలో ధవళ వస్త్రాలు ధరించి, చేతిలో లడ్డూతో చూడచక్కని రూపంతో పూజలందుకుంటున్న ఐదున్నర అడుగుల మట్టి వినాయకుడు.

పాలకొల్లు మెయిన్‌రోడ్డులోని గోల్డ్ మార్కెట్‌లో 12 అడుగుల బంగారు వర్ణంలోని గణనాథుడు ఠీవిగా ఆసీనుడయ్యాడు. బంగారు వర్తకులు దీనిని ఏర్పాటు చేశారు.

తణుకు కుచ్చర్లకోట వారి వీధిలోని గణనాథుడి విగ్రహంలో విద్యుత్ మోటారు ఏర్పాటు చేయడంతో స్వామి విగ్రహం కుడిచెయ్యి కదిలిస్తూ భక్తులకు దీవెనలు అందించడం విశేషం.

మాకొద్దులే!



ఉత్తమ అవార్డులపై టీచర్లలో అనాసక్తి

- జిల్లా స్థాయి బెస్ట్ టీచర్ అవార్డులకు ప్రతిపాదనలు 30లోపే..
- పోటీ లేకుండానే దరఖాస్తు చేసిన వారందరికీ ఉత్తమ పురస్కారాలు?

ఏలూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలందించిన టీచర్లకు గురుపూజోత్సవం రోజున ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందించేందుకు జిల్లాలో గురువులు కరవయ్యారు. బెస్ట్ టీచర్ అవార్డుల కోసం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, డీఈవోకు బాగా తెలిసిన వారితో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కోసం రికమండేషన్లు, సిఫార సులతో విద్యాధికారుల వద్ద ఒత్తిళ్లు తెచ్చే ఒకప్పటి రోజులు, పరిస్థితులు ఈ ఏడాది కనుచూపుమేరలో లేవంటే ఆశ్చర్యం కలిగించకమానదు. గతంలో ఏటా 100 నుంచి 150 మంది వరకు ఉపాధ్యాయులకు అందజేసిన బెస్ట్ టీచర్ అవార్డులకు ఈ ఏడాది జిల్లా మొత్తం మీద గరిష్ఠంగా 30 మంది లోపే దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారులందరికీ వారి సేవలు, సాధించిన విద్యా, విద్యాయేతర ప్రగతి, తదితర ప్రామాణికాల వడపోత, పరిశీలన ప్రక్రియలను నామమాత్రంగా ముగించి ఉత్తమ పురస్కారాలను అందజేసే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రతిపాదనలకు పాట్లు..

ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు అవార్డులందించేందుకు జిల్లా, మండలస్థాయిలో పాటించాల్సిన మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ ఇటీవల విడుదల చేసింది. అన్ని కేటగిరీల నుంచి అవార్డులందుకునే జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సంఖ్య 30కి మించరాదని స్పష్టంచేసింది. వీటిని ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, హెచ్‌ఎం కేటగిరీల నుంచి 10 చొప్పున జిల్లాస్థాయి సెలక్షన్ కమిటీ నిర్ణయించిన వారికే ఇవ్వాలని ఆదేశించింది. ఇక డివిజన్/మండల/మున్సిపల్ పరిధిలో ఇచ్చే అవార్డులకు మండలం/ మున్సిపాల్టీ నుంచి 10 మంది ఎస్జీటీలు, ఐదుగురు స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లను ఎంపికచేయాలని మార్గదర్శకాల్లో సూచించింది. దీనికనుగుణంగానే జిల్లావిద్యాశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 7,400 మంది టీచర్లు, హెచ్‌ఎంల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఆగస్టు 26వ తేదీ గడువు ముగిసే నాటికి అందిన దరఖాస్తులు 30లోపే ఉన్నాయి. వీటినే మండలాల్లో ఎంఈవోలు, డివిజన్లలో డీవైఈవోలు జిల్లా కార్యాలయానికి పంపించారు. జిల్లాస్థాయిలో డీఈవో (మిగతా 6వ పేజీలో)

పురస్కారాలపై అనాసక్తి ఎందుకో..?

సాధారణంగా పురస్కారమనగానే దానిని ఒక గుర్తింపు, గౌరవంగా ఎవరైనా భావిస్తారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకైతే అవార్డు అంటే ఉత్తమ పనితీరుకు అధికారిక గుర్తింపు. నిజాయితీగా పాఠశాలలు, విద్యారంగ అభివృద్ధికి తమవంతు విశేష కృషి చేసిన ఉపాధ్యాయులను గుర్తించి వారిని విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిరోజున ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారంతో గౌరవిస్తామంటే పెద్దగా ఆసక్తి కనబరచకపోవడం ఈ ఏడాది చర్చ నీయాంశమైంది. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవార్డులు దక్కడం ఖాయంగా సంకేతాలు వస్తున్నాయి. ఉత్తమ పురస్కారాలకు ఎంపికైన టీచర్ల జాబితా మంగళ లేదా బుధవారాల్లో విడుదలయ్యే అవకాశం ఉంది.

నిమజ్జన ఊరేగింపులో అపశ్రుతి

- దూసుకెళ్లిన ట్రాక్టర్
- నలుగురి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- తూర్పుతాళ్ళులో విషాదం



లోపలి పేజీలో..

12 నుంచి రాష్ట్రీయ పోషణ్ మహోత్సవం

ఏలూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏటా సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు జరిగే జాతీయ పౌష్టికాహార వారోత్సవాలను ఈ ఏడాది రాష్ట్రీయ పోషణ్ మహోత్సవం కింద మార్పు చేశారు. నెలరోజుల పాటు అంటే ఈనెల 12 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు జిల్లా మహిళాశిశు సంక్షేమశాఖ ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్లకు ఆదేశాలందాయి. దీన్ని పోషణ్‌మహ్ 2025 కింద చేర్చుతూ ఊబకాయం తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ సెంటర్లు, స్కూల్స్, పీహెచ్‌సీలు, అర్బన్ పార్కులు, కమ్యూనిటి హాల్స్ వద్ద 12 నుంచి 25 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. పౌష్టికాహారం ఏ విధంగా తీసుకోవాలన్న దానిపై 18 నుంచి 30 వరకు అంగన్‌వాడీ, ప్రైమరీ స్కూల్స్‌ను కలిపి చేపట్టన్నారు. ఇందులో ఔషధ మొక్కల ఉపయోగం కూడా ప్రస్తావించనున్నారు. అక్టోబరు 3 నుంచి 11 వరకు పౌష్టికాహారం అందించడానికి తండ్రులను సంసిద్ధం చేయడానికి ప్రత్యేక వర్క్‌షాపులు నిర్వహించనున్నారు. దీనిపై ఐసీడీఎస్ అధికారులు కసరత్తులు చేస్తున్నారు.



వేలేరుపాడు- రేపాకగొమ్ము రహదారిపై గోదావరి వరద

నిలకడగా గోదావరి వరద

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ భాగం నుంచి వచ్చి చేరుతున్న వరదతో భద్రాచలం వద్ద 47.9 అడుగుల వద్ద నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం ఉదయానికి 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయగా మధ్యాహ్నానికి ఒక అంగుళం తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. భద్రాచలం నుంచి 11లక్షల 39వేల క్యూసెక్కుల వరద నీరు దిగువకు వస్తుండడంతో వేలేరుపాడు మండలంలోని లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. వేలేరుపాడు, కోయిదా, రహదారిపై పలు చోట్ల వరద నీరు చేరుకోవడంతో 20 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కుక్కునూరులో వరద నిలకడగా ఉంది. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి మరింత పెరిగింది. కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు పెరగడంతో గేట్లు మూసుకుపోయి ఏటిగట్టు కుడివైపున ఉన్న కొండవాగుల జలాల నీటిమట్టం పెరుగుతూ వస్తోంది.

నిలకడగా తమ్మిలేరు..

చింతలపూడి : చింతలపూడి సమీపంలోని తమ్మిలేరు రిజర్వాయరులో ఎగువ నుంచి వచ్చే వరద ఆదివారం నాటికి తగ్గుముఖం పట్టింది. రిజర్వాయరులో నీటి మట్టం 348.8 అడుగులు ఉంది. ఇన్‌ఫ్లో వెయ్యి కూసెక్కులు వస్తుండగా, అవుట్‌ఫ్లో వెయ్యి క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో వరద నిలకడగా ఉందని ఏఈ లేజర్ తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్‌తో బార్‌ను దక్కించుకున్నారు..

- జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారులకు ఫిర్యాదు

ఏలూరు,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):నగరంలో శెట్టిబలిజ కులానికి కేటాయించిన బార్‌ను నకిలీ సర్టిఫికెట్‌తో వేరే కులానికి చెందిన వ్యక్తి దక్కించుకున్నారని, దీనివల్ల తమ కులస్తులు నష్టపోయారని శెట్టి బలిజ నాయకులు చింతపల్లి రామకృష్ణరాజు, గుబ్బలరాము, కడలి శ్రీనివాస్ జిల్లా ఎక్సైజ్‌శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆదివారం ఏలూరులోని జిల్లా కార్యాలయం వద్ద ఆందోళనకు సిద్ధమైనప్పటికీ ఫిర్యాదును మాత్రమే ఇచ్చారు. తూర్పుకాపు వర్గానికి చెందిన ఒక వ్యక్తి అక్రమ రీతిలో దక్కించుకున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో న్యాయం చేయాలని అధికారులను కోరారు. దీనిపై విచారణకు అధికారులు సిద్ధమైనట్టు సమాచారం.

పీజీఆర్ఎస్ దారెటు ?

- కిందిస్థాయికి వికేంద్రీకరణ జరిగినా జిల్లా కేంద్రంలో తప్పని వినతులు
- ప్రతివారం.. 300 పైగా ఫిర్యాదులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను వికేంద్రీకరించామని చెబుతున్నా.. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారుల సంఖ్య తగ్గడం లేదు. జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి అర్జీ ఇస్తేనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని అర్జీదారులు భావించడమే దీనికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. మండల, ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాల స్థాయిల్లో వచ్చిన దరఖాస్తులే.. జిల్లా కేంద్రానికి వస్తున్నాయా? అన్న పరిశీలన జరుగుతోందా? అంటే సమాధానం తూచ్. ఆయా ప్రాంతాల్లో వినతులు ఏ రీతిన వస్తున్నాయి.. జిల్లా స్థాయిలోను వచ్చినవి అవేనా అన్న కోణంలో పరిశీలన చేయాల్సిన బాధ్యత ఎవరు తీసుకుంటున్నారో తెలియడం లేదు.

నమ్మకం పెరిగేలా చేస్తారా?

ప్రజా సమస్యల్లో ఎక్కువగా వస్తున్నవి.. తన పొలంలో ఆక్రమణ జరిగిందని, అన్నదమ్ములు ఆస్తులు లాగేసుకున్నారని, కబ్జాలు జరుగుతున్నాయని, తమ పిల్లలు తమను చూడడం లేదన్నవే ఎక్కువ వస్తున్నాయి. మరోవైపు సివిల్ తగాదాల విషయంలో అధికారులు జోక్యం చేసుకునే పరిస్థితులుండవు. అలాంటప్పుడు వందల్లో వచ్చిన దరఖాస్తులన్నీ పరిష్కారం అవుతున్నాయంటే అదొక అంతులేని ప్రశ్నే. జిల్లాలో ఈ ఏడాదిలో జూన్ 15వ తేదీ నుంచి ఆగస్టు వరకు 40వేల420 ఫిర్యాదులు అందగా.. ఇందులో 36వేల 648 ఫిర్యాదులను పరిష్కరించినట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఇన్ ప్రోగ్రెస్‌లో 2వేల 111, పెండింగ్‌లో 218, ఇతరత్రా కారణాల వద్ద శాఖల వద్ద పరిశీలనలో ఉన్నవి 218గా చెబుతు న్నారు. 1304 ఫిర్యాదులను ఇటీవల మళ్లీ రీ ఓపెన్ చేశారంటున్నారు. ఇలా దరఖాస్తులు పరిష్కరించిన వి పెద్ద సంఖ్యలో ఉన్నప్పుడు.. ప్రతీ సోమవారం 300కు పైగా ఫిర్యాదుదారులు కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు, ఇతర శాఖల అధికారులకు వినతులు ఎందుకిస్తున్నారో? పెద్ద మిస్టరీగా మారింది.



సంతృప్తి స్థాయిని తెలుసుకోవడం మొక్కుబడే..

పీజీఆర్ఎస్‌లో మీ సమస్యలను అధికారులు ఎలా పరిష్కరించారు. మిమ్మల్ని ఎలా రిసీవ్ చేసుకుంటున్నారు.. అంటూ అప్పుడప్పుడు ఉన్నతాధికారులు చేస్తున్న శాంపిల్ సర్వేలు మొక్కుబడిగా మారాయి. దీంతో ప్రజల నుంచి సంతృప్తి స్థాయి ఏ మాత్రం పెరగడం (మిగతా 6వ పేజీలో)

కైకరం రైల్వే గేటు మూసివేత

ఉంగుటూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):ఉంగుటూరు మండలం కైకరం రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం నుంచి మూసివేశారు. ఐదు రోజుల పాటు గేటును మూసివేయనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. గుణ్ణంపల్లి, అక్కుపల్లిగోకవరం మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

నేడు పింఛన్ల పండుగ

- సెప్టెంబరు నెల పింఛన్ల పంపిణీకి సర్వంసిద్ధం

ఏలూరుసిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలో సెప్టెంబరు నెలకు సంబంధించి 2,61,221 మంది లబ్దిదారులకు రూ.114.13 కోట్లు సోమవారం ఉదయం 7 గంటల నుంచి పంపిణీ చేయనున్నారు. దీని నిమిత్తం జిల్లాలోని సచివాలయ ఉద్యోగులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు కలిపి మొత్తం 5,275 మంది సిబ్బందిని కేటాయించారు. అనివార్య కారణాల వల్ల పెన్షన్లు తీసుకోని వారికి సెప్టెంబరు 2న పంపిణీ చేస్తారు. పింఛన్ల పంపిణీపై కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులతో సమీక్షించారు. పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు ఆదివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

జిల్లాలో కేటగిరీల వారీగా పింఛన్‌ల వివరాలు

పింఛన్ రకం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం
అభయహస్తం	4,569	23,63,000
అమరావతి లాండ్‌లెస్‌పూర్	7	35,000
డప్పుకళాకారులు	2,016	81,16,000
విభిన్న ప్రతిభావంతులు	32,836	2,00,166,000
మత్స్యకారులు	6,091	2,53,04,000
కళాకారుల పెన్షన్	162	6,68,000
వృద్ధాప్య	1,24,849	51,10,65,500
సైనిక్‌వెల్ఫేర్	15	75,000
సింగిల్ ఉమెన్	8,241	3,37,56,000
కల్లుగీత కార్మికులు	4479	1,81,08,000
చర్మకారులు	1,652	66,52,000
ట్రాన్స్‌జెండర్	75	3,36,000
నేత కార్మికులు	1,103	44,84,000
వితంతు	72,622	29,86,60,000
డీఎంహెచ్‌వో	2,504	3,15,20,000
మొత్తం	2,61,221	114,13,08,500



పెనుమంట్ర డీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌లో
25 టన్నుల యూరియా మాయం?


పెనుమంట్రలో స్టాక్ పాయింట్

పెనుమంట్ర, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పెనుమంట్ర సొసైటీలో నిర్వహిస్తున్న డీసీఎంఎస్ స్టాక్ పాయింట్‌లో 25 టన్నుల యూరియా నిల్వలు మాయమైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. సొసైటీ నిర్వహణపై తొలి నుంచి ఆర్థిక అవకతవల ఆరోపణలు ఉన్నాయి. 2014లో అప్పటి ఎంపీపీ సరోజిని ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. అనంతరం సీబీసీఐడీ విచారణతో సొసైటీ అధికారులు ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ పాలనలో ఎరువులు పురుగు మందులు విక్రయానికి డీసీఎంఎస్ ద్వారా స్టాక్ పాయిం ట్ ఏర్పాటుచేసి తాత్కాలిక ఉద్యోగిని నియమించారు. అప్పటి నుంచి సొసై టీకి సంబంధం లేకుండా డీసీఎంఎస్ పర్యవేక్షణలో ఎరువులు విక్రయాలు జరుగుతున్నాయి. తాత్కాలిక ఉద్యోగి ఈపాస్ లేకుండా, బినామీ పేర్లతో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు స్టాక్ పాయింట్‌పై దృష్టి సారించి లక్షలాది రూపాయల అవకతవకలు గుర్తించారు. నిర్వాహకుడి నుంచి జిల్లా అధికారు లు రూ.22.25 లక్షలు రికవరీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అతడిని మరొక చోటికి బదిలీ చేయగా మూడు రోజుల ముందే గొడౌన్‌లో 25 టన్నుల యూరియా తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్క రైతుకు యూరియా రెండు బస్తాలు మించి విక్రయించకూడదనే ఆంక్షల నేపథ్యంలో 25 టన్నుల యూరిగా ఎలా మాయమైందనేది ప్రశ్నార్థకం.

డీఎస్సీ అభ్యర్థులకు
రెండో విడత కాల్ లెటర్స్?

- అధికారుల కసరత్తు

ఏలూరు అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 నియామకాల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అన్ని కేడర్ల నుంచి సుమారు 50 మందిలోపు అభ్యర్థులకు రెండో విడత కాల్‌లెటర్ల జారీ, సర్టిఫికెట్ల పరిశీలన ఉండవచ్చని సంకేతాలు అందుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. మొదటి విడత కాల్ లెటర్లు జారీ అయిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా, గైర్హాజరైన అభ్యర్థులు, ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకుని కాల్ లెటర్లు అందుకున్న వారి అర్హతలకు తగిన పోస్టు మినహాయించి మిగతా ఉద్యోగాలకు, ఆయా పోస్టులకు తగిన విద్యార్హతలు లేని వారిస్థానంలో తదు పరి మెరిట్ అభ్యర్థులతోపాటు, వివిధ రిజర్వేషన్ కేటగిరీల నుంచి అర్హులను చేర్చి రెండో విడత కాల్ లెటర్ల జారీ చేపట్టినట్టు తెలిసింది.

తెలుగు నిబంధన చర్చనీయాంశం

నవోదయ, కేంద్రీయ విద్యాలయ, సీబీఎస్ఈ, తదితర కేంద్ర విద్యాసంస్థల్లో చదివిన కొందరు అభ్యర్థులను 'తెలుగు' నిబంధనతో అనర్హులుగా చేయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. జీవో నిబంధనల మేరకే విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకున్నట్టు విద్యాశాఖ వర్గాలు చెబుతుండగా, డీఎస్సీ అభ్యర్థుల వాదన భిన్నంగా ఉంది. కేంద్ర విద్యాసంస్థల్లో పదో తరగతిలో ప్రథమ భాష లేదా ఇంటర్మీడియట్‌లో ద్వితీయ భాషగా తెలుగు లేదా డిగ్రీలో కోర్ సబ్జెక్టుల్లో తెలుగు ఒకటిగా ఉంటేనే డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, తదితర పోస్టులకు అర్హులవుతారని విద్యాశాఖ వివరణ ఇవ్వడంపై విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి విద్యా కోర్సుల్లో తెలుగు ఒక సబ్జెక్టుగా ఉంటే సరిపోతుందని అభ్యర్థులు చెబుతున్నారు. కేంద్ర విద్యా సంస్థల్లో టెన్త్ చదివిన విద్యార్థులకు ఫస్ట్ లాంగ్వేజీ తెలుగు ఉంటేనే డీఎడ్/బీఎడ్ ప్రవేశాలు కల్పిస్తామని అప్పట్లోనే విద్యాశాఖ షరతు పెట్టి ఉంటే తమకు డిగ్రీ, ప్రవేశ పరీక్షలు, ఉపాధ్యాయ విద్య శిక్షణ కోర్సు పూర్తి చేయడానికి వెచ్చించిన ఆరేళ్ల సమయం కోల్పోయేవారం కాదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ ఉద్యోగాలకు పోటీపడి సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన తరుణంలో నిబంధనల మాటున అనర్హులుగా చేయడం సబబు కాదని వాపోతున్నారు. ప్రభుత్వ పెద్దల వద్దకు వెళ్లడం లేదా కోర్టు, మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించనున్నట్టు ప్రచారం జరుగుతోంది. సెలక్షన్ జోన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు సెప్టెంబరు 5లోగా నియామక పత్రాలను జారీచేసి, తర్వాత పోస్టింగ్‌లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారని తెలిసింది.

ఎంఈవోలు, హెచ్ఎంల గుర్రు

డీఎస్సీ ప్రకటన వెలువడిన నాటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వరకు ప్రతీ దశలో తమ వంతు విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖాధికారులు చులకనభావంతో మాట్లాడుతున్నారని కొందరు ఎంఈవోలు, హెచ్ఎంలు ఆవేదన చెందుతున్నట్టు తెలిసింది. ఇటీవల రెండు రోజుల పాటు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంఈవోలు, హెచ్ఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు పనిచేశామని, అంతా విజయవంతంగా ముగిసిన తర్వాత వేధించే విధంగా ఒత్తిళ్లు తేవడం, అవహేళనగా మాట్లాడడాన్ని సహించలేకపోతున్నామని సహచరుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. ఆదివారం సాయంత్రం జిల్లా విద్యాశాఖలోని ఒక కీలక అధికారి ఒక ఎంఈవోకు ఫోన్‌చేసి బెదిరింపు ధోరణిలో మాట్లాడ డంతో విసుగుచెందిన ఆ ఎంఈవో దీటుగానే స్పందించినట్టు తెలిసింది. నోటికి వచ్చినట్టు మాట్లాడితే సహించేదిలేదని చెప్పినట్టు సమాచారం. భోదనేతర సిబ్బందితో చేయించాల్సిన పనులను ఎంఈవోలు, హెచ్ఎంలు చేస్తున్నారని వివరణ ఇచ్చిన ఎంఈవో ఇక మీదట అభ్యంతకరంగా మాట్లాడితే ఉన్నతాధి కారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పినట్టు తెలిసింది.

నరసాపురం పట్టణాన్ని
జిల్లా కేంద్రం చేద్దాం

- సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళదాం
- వైసీపీ హయాంలో జరిగిన అన్యాయాన్ని వివరిద్దాం
- ఐక్యంగా పోరాడదాం
- జేఏసీ సమావేశం తీర్మానం


జేఏసీ సమావేశంలో మాట్లాడుతున్న నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నాయకర్

నరసాపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తీర ప్రాంతంలో ఉన్న అన్ని సబ్ డివిజన్లు జిల్లా కేంద్రాలయ్యాయి. ఒక్క నరసాపురం తప్ప.. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు దీనికి కారణం. భౌగోళికంగా అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ ఉద్దేశ పూర్వకంగానే నరసాపురం పట్టణాన్ని జిల్లా కేంద్రం చేయలేదు. 60 రోజులు ప్రజలు పోరాడినా ప్రభుత్వం పట్టించుకోలేదు. జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కొత్త జిల్లాలపై ప్రభుత్వం నియమించిన కమిటీ దృష్టికి తీసుకెళ్లి తిరిగి జిల్లా కేంద్రం సాధించుకుందాం. ఇందుకు పార్టీలు పక్కనబెట్టి అంతా ఐక్యంగా ముందుకు సాగుదాం. నరసాపురంలో జేఏసీ తీర్మానం ఇది.

నరసాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షత ఆదివారం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నాయకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి జరిగిన అన్యాయాన్ని వివరిద్దామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నియమించిన కమిటీ ఛైర్మన్ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకెళ్లినట్లు నాయకర్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మాట్లాడుతూ అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు స్వార్థ రాజకీయాల వల్లే నరసాపురానికి జిల్లా కేంద్రం చేజారిపోయిందన్నారు. తీర ప్రాంతంలో ఉన్న అమలాపురం, మచిలీపట్నం, బాపట్ల సబ్ డివి జన్లను జిల్లా కేంద్రాలను చేసి ఒక్క నరసాపురానికే వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దీనిపై మనమంతా ఐక్యంగా పోరాడదామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి రామరాజు, కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు, కోటిపల్లి సురేష్, పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటులో జరిగిన తప్పులు సరి చేసేందుకు కూటమి ప్రభుత్వం కమిటీ వేయడం శుభపరిణామం అన్నారు. కొత్తగా జిల్లా ఏర్పాటుచేసిన ప్రభుత్వానికి ఎటువంటి ఖర్చు కూడా ఉండదన్నారు. జిల్లా కేంద్రంలో అవసరమైన స్థలాలు, డివిజన్ కార్యాలయాలు నరసాపురం పట్టణంలోనే ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామని వారు అన్నారు. జేఏసీ సమావేశంలో షైలా వసంతరావు, దొండపాటి స్వామి, బాబ్జి, వర్దనపు ప్రసాద్, డాక్టర్ ప్రకాష్, సూరిబాబు, కొప్పాడ రవి, మాత్రాజు, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమా, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో వైసీపీ, కాంగ్రెస్ కుయుక్తులు
ఎంపీ పాకా సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫైర్



పాలకోడేరు, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణంపై కూటమి నేతల మధ్య చిచ్చుపెట్టేలా వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు కుయుక్తులు పన్నుతున్నాయని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. పాలకోడేరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో భీమవరం జిల్లా కేంద్రం విషయమై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు పార్టీలు ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టే విధంగా జిల్లా కేంద్రం ఎక్కడికో వెళ్లిపోతుందన్నట్లు మాట్లాడడం సమంజసం కాదన్నారు. 2026లో నియోజకవర్గాలు మారే అవకాశం ఉందని, భీమవరం మునిసిపాలిటీ విస్తరించే అవకాశం కూడా ఉందన్నారు. భీమవరం పట్టణానికి చేర్చి ఉన్న చాలా గ్రామాలు భీమవరం మునిసిపాలిటీలో విలీనమయ్యే అవకాశం ఉంది. ఏ గ్రామం ఎక్కడుంటుందో కూడా స్పష్టత లేదు. జిల్లా కేంద్రం భీమవరం చుట్టుపక్కల ఉంటుందని, దానిపై అపోహలకు తావివ్వవద్దని అన్నారు.

వారి వ్యాఖ్యలు విడ్డూరం

జిల్లా కేంద్రం భీమవరం విషయంలో కొంత మంది నేతలు కూటమికి బీటలు తేవాలనుకుని వాతలు పెట్టుకుంటున్నారని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పసుపు, ఎరుపు కలిపితే కాషాయం రంగు వస్తుందని, పాలు నీళ్ల వలె కలిసిపోయిన కూటమి పార్టీకి బీటలు తెచ్చేవిధంగా మాట్లాడడం విడ్డూరం గా ఉందన్నారు. భీమవరానికి అతి చేరువలో రహదారిని చేర్చి కలెక్టరేట్ నిర్మించేందుకు కృషి చేస్తుంటే కొంత మంది రాజకీయం చేస్తున్నారన్నారు. ఎవరు ఎన్ని పన్నాగాలు పన్నినా ఎవరూ దెబ్బతీయలేరన్నారు.



గణేశ్ ఉత్సవాల్లో విషాదం
నిమజ్జన ఊరేగింపులో నలుగురి దుర్మరణం


ప్రభుత్వాసుపత్రిలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాయకర్, ఎస్పీ నయీం, కలెక్టర్ నాగరాణి

- తీవ్ర గాయాలైన మరొకరికి ఆస్పత్రిలో చికిత్స
- యువకులపైకి దూసుకుపోయిన వినాయక విగ్రహం ఉన్న ట్రాక్టర్
- ఈమన వారి మెరక నుంచి నరసాపురం గోదావరి వద్దకు ఊరేగింపు
- తూర్పుతాళ్ల వద్ద సంఘటన
- ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్ పరామర్శ

మొగల్తూరు/నరసాపురం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ఊరేగింపులో ఆదివారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపులో డ్యాన్స్ చేస్తున్న బృందంపై వినాయక విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా దూసుకుపోయింది. ఈసంఘటనలో నలుగురు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామంలో జరిగిన సంఘటనపై పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈమన వారి మెరకలో వినాయక చవితి సందర్భంగా 15 అడుగుల గణనాథుడి విగ్రహన్ని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ఆదివారం నిమజ్జన ఊరేగింపు చేపట్టారు. నరసాపురం వద్ద గోదావరిలో నిమజ్జనం చేయడానికి గ్రామం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లగానే ట్రాక్టర్ ముందు యువకులు నృత్యాలు చేస్తుండగా కమిటీ సభ్యులు గొడవ జరగకుండా గమనిస్తున్నారు. ఆ సమయంలో ట్రాక్టర్ ఒక్కసారిగా నృత్యం చేస్తున్న వారిపై దూసుకు వెళ్లింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఇద్దరిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి, మరో ఇద్దరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. యివన సూర్యనారాయణ (58) అక్కడికక్కడే మృతిచెందగా తిరుమల నర్సింహమూర్తి (35), గురుజు మురళి (38), కడియం దినేష్ (9) మృతి చెందినట్టుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ కంచర్ల ప్రసాద్‌ను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.

తీరంలో దిగ్భ్రాంతి

ఈ సంఘటనతో తీర ప్రాంతం ఉలిక్కిపడింది. గత మూడు రోజులుగా నిమజ్జనం సమయంలో పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ ఐజి అశోక్, ఎస్పీ నయీం, డీఎస్పీ శ్రీవేద సూచించారు. ఈ నేపథ్యంలో ఐదో రోజు గురువారం నరసాపురం పట్టణ, మండలంతో పాటు పాలకొల్లు ప్రాంతం నుంచి పలు విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం చేసేందుకు తరలివచ్చాయి. ఏఎస్పీ భీమారావు పోలీస్ బందోబస్తుతో వలందర్ రేవు వద్ద ఉండి నిమజ్జన కార్యక్రమాలు పరిశీలిస్తున్నారు. తూర్పుతాళ్లలో నిమజ్జన ఊరేగింపులో ట్రాక్టర్ యువకులపై దూసుకువెళ్లిందన్న సమాచారంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన రెవెన్యూ, మొగల్తూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో తరలించారు.

ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్ పరామర్శ

సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే నాయకర్ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లారు. మృతదేహాలను సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం, ఏఎస్పీ బీమారావు, డీఎస్పీ శ్రీవేదకు ప్రమాద వివరాలను వివరించారు. చికిత్స పొందుతున్న యువకుడికి మెరుగైన వైద్యం అందించాలని నాయకర్ ఆదేశించారు.


ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో మృతదేహాలు



ఊరికి ఉదయమే వచ్చాడు!

వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా జరిగిన ఘటనలో మృతుల్లో తిరుమల నర్సింహమూర్తి కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు ఏడాది వయసు గల పిల్లలు న్నారు. ఇద్దరు కవలలు, విశాఖలో పని చేసుకుంటున్న నర్సింహమూర్తి ఉదయమే గ్రామానికి వచ్చాడు. సాయంత్రం వరకూ భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో గడిపి ఊరేగింపులో పాల్గొని మృత్యువాత పడ్డాడు.

మండుతున్న కూరగాయలు

తాడేపల్లిగూడెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కూరగాయల ధరలు మండుతున్నాయి. గతవారం వరకు కిలో రూ.50 పలికిన వంకాయలు రూ.80 ధరకు చేరాయి. రూ.30 ఉండే దోసకాయలు రూ.50, రూ.90 ఉండే చిక్కుళ్లు ఇప్పుడు రూ.120కు చేరింది. కూరగాయల ధర గత వారంతో పోల్చుకుంటే కిలోకు రూ.5 నుంచి 10కు పెరిగాయి. కాగా ఆగాకర రూ.170 నుంచి 140కి దిగింది. టమాట కూడా 60 నుంచి 40కు వచ్చింది. బీరకాయలు కిలో రూ.50, బెండ, దొండ కిలో రూ.40, క్యాప్సికం రూ.100, కాకర రూ.50, గోరు చిక్కుళ్లు రూ.80, క్యారెట్ రూ.50కు విక్రయించారు.

మార్కెట్లో మహారాష్ట్ర ఉల్లి ధర నిలకడగా ఉంది. నాణ్యమైన ఉల్లి 4 కిలోలు రూ.100, రెండో రకం 5 కిలోలు రూ.100 చొప్పున విక్రయించారు. కర్నూలు ఉల్లి ధర పతనమైంది. 7 నుంచి 8 కిలోలు రూ.100 వంతున విక్రయించారు. కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ ఉల్లిలో డ్యామేజ్ ఎక్కువగా కనిపించడంతో పాటు ఎర్రగా ఉన్నాయి.

ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా మహ్మద్ మాజీద్



నిడమర్రు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా క్రొవ్విడి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మహమ్మద్ నూరుద్దీన్ (మాజీద్) నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాజీద్‌కు ఫోన్‌చేసి అభినందించారు. మాజీద్ మాట్లాడుతూ క్రమశిక్షణ గల కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ గుర్తింపు ఇస్తుందని తన నియామకం నిరూపించిందన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఉంగుటూరు నియోజకర్గ కన్వీనర్ గన్ని వీరాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీద్‌ను మండల కన్వీనర్ ముత్యాల స్వామి, పొట్నూరి సింహచలం, మహ్మద్ గఫార్ ఖాన్, ఆదిరెడ్డి చంద్రరావు, మహమ్మద్ జాకీర్ తదితరులు అభినందించారు.

అదృశ్యమైన హెడ్ కానిస్టేబుల్ మృతి

- ఎర్రకాలువలో మృతదేహం లభ్యం
- విధుల్లో ఉండగా ద్విచక్ర వాహనంతో గల్లంతు
- కుటుంబ సభ్యులకు ఎస్పీ పరామర్శ

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ మృతదేహం ఎర్ర కాలువలో ఆదివారం లభ్యమైంది. ఆగస్టు 29న రాత్రి నుంచి కనిపించకుండా పోయిన ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ బుడుపుల సుబ్బారావు (55) మృతి చెందారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం సమీపంలో ఎర్రకాలువలో ఆయన లభ్యమైంది. డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపిన వివరాల ప్రకారం కామవరపుకోట, టి.నరసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో సుబ్బారావు స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం బుట్టాయగూడెం నుంచి ప్రతీరోజు విధులకు హాజరవడం ఇబ్బందిగా ఉందని కామవరపుకోటలోనే గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. 29న రాత్రి విధుల్లో భాగంగా టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెం నుంచి అప్పలరాజుగూడెం రహదారిలో చప్టాపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువలో ప్రమాదవశాత్తు సుబ్బారావు తన ద్విచక్ర వాహనంతో పాటు గల్లంతయ్యాడని డీఎస్పీ తెలిపారు. వరద ఉధృతిని అంచనా వేయలేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నామన్నారు. సుబ్బారావు ఫోన్ పనిచేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఆయన కుమారుడు జాన్ రాజు శనివారం తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుబ్బారావు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఆధునిక సాంకేతికను ఉపయోగించి జంగారెడ్డిగూడెం, పోలవరం డీఎస్పీలు రవిచంద్ర, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం నుంచి ఎర్రకాలువలో ఫైర్, ఫిషరీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు, డ్రోన్ కెమేరాలతో గాలించారు. ప్రమాదం జరిగిన ప్రదేశం వద్ద సుబ్బారావు ద్విచక్ర వాహనం లభ్యమైంది. ఆదివారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతయ్యాడని భావిస్తున్న ప్రదేశానికి మూడు కిలో మీటర్ల దూరంలో కాలువలో మృతదేహం లభ్యమైంది. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. సుబ్బారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


కాలువలో లభ్యమైన మృతదేహం (ఇన్‌సెట్) సుబ్బారావు (ఫైల్)


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ కిశోర్

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎస్పీ

బుట్టాయగూడెం: మృతి చెందిన సుబ్బారావు కుటుంబ సభ్యులను ఎస్పీ కేపీఎస్.కిశోర్ పరామర్శించారు. అతడి భార్య పిల్లలకు ధైర్యం చెప్పి, శాఖాపరంగా ఆదుకుంటామన్నారు. పూర్తి విచారణ జరిపి న్యాయం చేస్తామన్నారు. డీఎస్పీ వెంకటేశ్వరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ మల్లేశ్వరావు నివాళులర్పించారు.

సుబ్బారావు మృతదేహానికి పోలీస్ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సమాధి కార్యక్రమానికి ముందు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. డీఎస్పీ, సీఐలు, ఎస్ఐ పోలీసులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

స్నేహితుడే.. కత్తితో పొడిచేశాడు
ఏలూరులో పట్టపగలు దారుణ హత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ స్నేహితులే. వారిద్దరి మధ్య ఏమి జరిగిందో.. ఇంట్లో అప్పుడే భోజనంచేసి చేయి కడిగి తుడుచుకుంటుండగా కారులో వచ్చిన స్నేహితుడు అన్నా పని ఉందంటూ కారు వద్దకు తీసుకువెళ్లాడు. అకస్మాత్తుగా కత్తితో పొడిచాడు. అతడికి మరో యువకుడు సహాయం చేయగా మరో ఇద్దరు యువకులు కారులోనే ఉన్నారు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. హత్యకు కారణాలు అంతుపట్ట లేదు. స్థానికులు, పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం..

ఏలూరు రూరల్ మండలం కొమడవోలు పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న పూనూరి రాజేష్ (42)కు భార్య దైవమణి, కుమార్తె సంజన, కుమారుడు సంతోష్ ఉన్నారు. ఒక టీడీపీ నాయకుడి వ్యాపార, వ్యవహారాలను రాజేష్ చూస్తూ ఉంటాడు. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులందరూ భోజనం చేస్తున్నారు. రాజేష్ అప్పుడే భోజనం చేయగా అదే ప్రాంతానికి చెందిన రాజేష్ స్నేహితుడు సరిపల్లి విజయ్ అలియాస్ చిన్ని నాని అనే కారు డ్రైవర్ అన్నా మాట్లాడే పని ఉందంటూ పిలిచాడు. మాట్లాడుతూ కారు వద్దకు తీసుకువెళ్లాడు. రాజేష్ కుమారుడు సంతోష్ కూడా బయటకు వచ్చి చూస్తున్నాడు. బాలుడి కళ్ల ముందే అకస్మాత్తుగా నాని కత్తితీసి రాజేష్‌ను పొడిచాడు. ఏలూరునకు చెందిన లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు కూడా ఈ దాడిలో పాల్గొన్నారు. మరో ఇద్దరు కారులో ఉన్నారు. కత్తిపోట్లు గురైన రాజేష్ అరుస్తూ తన ఇంటిలోకి పరిగెడుతూ వరండాలో పడిపోయాడు. భోజనం చేస్తున్న రాజేష్ భార్య దైవమణి, కుమార్తె సంజన, దైవమణి సోదరి నాగమణి పరిగెత్తుకుని బయటకు వచ్చి వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా కారెక్కి వెళ్లిపోయాడు. రాజేష్‌ను వెంటనే ఆటోలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, రూరల్ ఎస్ఐ బి.నాగబాబు, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యుల నుంచి డీఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.


మృతుడి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

రెండు రోజుల క్రితం..

ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితమే ఏలూరుకు చెందిన లంకపల్లి బాలకృష్ణ అలియాస్ బాలు చిరంజీవి బస్టాప్ ప్రాంతానికి తన అనుచరులతో వెళ్లి అక్కడ వేరే వారితో గొడవకు దిగి హత్య చేస్తానంటూ స్థానికులను బెదిరించాడు. పోలీసులు రెండు వర్గాలను పిలిచినప్పటికీ సరైన బైండోవర్ చేయకపోవడంతోనే బాలు ఈ హత్యలో పాల్గొన్నట్లు చెబుతున్నారు. తానేమిటో చూపిస్తానంటూ అక్కడ బెదిరింపులకు పాల్పడ్డాడని పోలీసులు మాత్రం ఈ వ్యవహారాన్ని పట్టించుకోలేదని అందువల్లే ఈ హత్య జరిగిందంటూ చెప్పుకుంటున్నారు. ఇటీవల ఘర్షణకు పాల్పడుతున్న వారిపై పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని, శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్దకు వందలాది మంది చేరుకున్నారు. టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ వారి సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


రాజేష్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

ప్రత్యేక బృందాలతో గాలింపు

రాజేష్ హత్య కేసులో నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. నిందితులను గుర్తించామని, నలుగురు పాల్గొన్నట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. మృతుని కుటుంబ సభ్యులు హంతకులను గుర్తించారని, నిందితులను అరెస్టు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ముందస్తుగా ఆ ప్రాంతంలో పోలీస్ పికెట్లను ఏర్పాటు చేశామన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, హత్యకు కారణాలు, ఆధారాలు సేకరిస్తున్నామన్నారు.

రజిత పతకం గ్రహీత సుంకర నాగవాసుకు సన్మానం

చింతలపూడి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దేశం తరఫున జర్మనీలో జరిగిన ప్రపంచ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌లో 5 కేఎం రేస్ వాకింగ్‌లో ద్వితీయ స్థానం పొంది రజిత పతకం సాధించిన జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ ఆఫీసర్ సుంకర నాగవాసు నాయుడును ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తన కార్యాలయంలో శాలువా కప్పి ఆదివారం అభినందించారు. ఈ రేసులో మొత్తం 51 దేశాలు పాల్గొనగా ద్వితీయ స్థానం పొంది రజిత పతకం సాధించడం అభినందనీయమన్నారు. తడికలపూడి సొసైటీ అధ్యక్షుడు తూతా బాలాజీకుమార్ పాల్గొన్నారు.

'జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తున్నాం'

కొయ్యలగూడెం, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తున్నామని జనసేన మండల అధ్యక్షుడు తోట రవి అన్నారు. ఆదివారం సరిపల్లె గ్రామంలో పార్టీ మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొయ్యలగూడెం మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కేడర్ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సెప్టెంబరు 2న జరగబోయే పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. జనసేన నాయకులు, అన్ని గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం : చింతమనేని


సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):పేదల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అనారోగ్య కారణాలతో వైద్యం చేయించుకున్న పలువురు బాధితులకు ఆదివారం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందించి మాట్లాడారు. పార్టీలకు అతీతంగా పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పింఛన్ల పంపిణీలోనూ అర్హులకే ప్రాధాన్యత ఉంటుం దన్నారు. అనర్హులుంటే రద్దుకు ఏ మాత్రం వెనుకాడబోమని స్పష్టంచేశారు.

'జాతరను సమష్టిగా విజయవంతం చేద్దాం'

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏలూరు తూర్పువీధిలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుబాబు జాతరను సభ్యులు, భక్తులు, స్థానికులు సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని ఆలయ అధ్యక్షుడు వంకినేని భానుప్రకాశ్ పిలుపునిచ్చారు. ఆదివారం జాతర కమిటీ సభ్యులు గంగానమ్మ, కనకదుర్గమ్మ ఆలయాల కమిటీ సభ్యులతో జాతర విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర సందర్భంగా పోతురాజుబాబు గెడ ప్రతీ ఇంటినీ సందర్శించే విధంగా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబరు 31వ తేదీన ఉదయం 9.59 గంటలకు పందిరి రాట వేయడం, ముడుపు కట్టేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. వంకినేని కిరణ్‌కుమార్, మహేంద్రకుమార్, రఘుకుమార్, ముసునూరి బాలాజీ, కొట్లూరి సత్యకుమార్, వంకినేని ఆహ్లాద, పృథ్వి కృష్ణ, కలగర శివరామకృష్ణప్రసాద్, యడ్లపాటి రాము, గోవాడ శివరామకృష్ణ, కార్పొరేటర్లు శ్రీదేవి, సుంకర చంద్రశేఖర్ ఉన్నారు.

డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ


డాక్టర్ శ్రీనివాసరావు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ఏరియా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. మచిలీపట్టణానికి చెందిన ఆయన పెదపాడు పీహెచ్‌సీ వైద్యుడి చేరి ఆ తరువాత ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చీఫ్ ఫిజీషియన్‌గా విధులు నిర్వర్తించారు. ముఖ్యంగా కొవిడ్ మహమ్మారి ప్రాణాంతకంగా ఉన్న పరిస్థితుల్లో ఆయన బృందం చేసిన సేవలు మరువలేనివి. ఆయన సేవలను గుర్తించి ఆ కాలంలోనే విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో రాష్ట్రస్థాయిలోనే కరోనా వైద్యసేవ సలహాదారునిగా ప్రభుత్వం నియమించి సేవలను వినియోగించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీగా మారినప్పటికీ ఈ ఏడాది జనవరి వరకు సేవలు అందించారు. ఆ తరువాత నూజివీడు బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూజివీడు, ఏలూరు ప్రాంతాల్లో పలు తేదీల్లో ఆయనను సన్మానించేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తా : పార్వతమ్మ


మాట్లాడుతున్న కమ్మరి పార్వతమ్మ

ఏలూరు రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ పేర్కొన్నారు. ఏపీ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ద్వితీయ వార్షికోత్సవం విజ్ఞాన వేదిక శివశ్రీ నిలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌లను నియమించాల్సి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా పర్యటన చేసి క్షేత్రస్థాయి సమస్యలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిస్తానని తెలిపారు. దాసరోజు శ్రీనివాస్, కవులూరి కృష్ణమాచార్యులు, శ్రీనివాస నిలయం చారిటీస్ చైర్మన్ నాటకం శ్రీనివాసాచారి, చిట్రోజు తాతాజీ, సత్యనారాయణ, రాష్ట్ర మహిళా కార్యదర్శి లక్కోజు సుజాత, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ కార్యదర్శి ముసినాడ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 'వారాల పండుగ'


నారాయణప్రసాద్, విష్ణు, ప్రేమ్‌బాబుకు సన్మానం

దెందులూరు,అగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని దెందులూరు, ఉండ్రాజ వరం గ్రామాల్లో వారాల పండుగను ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లకు ముర్రాట. పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి గ్రామస్థులందరూ బంధువులు, కుటుంబసభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. అందరినీ చల్లగా చూడాలని పూజలు చేశారు. అనంతరం డప్పు వాయిద్యాలు, బ్యాండు సన్నాయిలతో వందలాది మంది భక్తులతో ఉండ్రాజ వరంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవార్లను ఎమ్మెల్యే తనయుడు చింతమనేని ప్రేమ్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్, ఎమ్మెల్యే సహాయక కార్యదర్శి విష్ణు, టీడీపీ నేతలు మోతుకూరి నాని, బాయి రామ్‌ప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు. దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో పోతురాజు, అమ్మవార్ల ఆలయంలో మూడు వారాలుగా వారాల పండుగ నిర్వహించి నిప్పుల గుండం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాకొద్దులే !

(3వ పేజీ తరువాయి)

అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత టీచర్లు విద్యారంగ అభివృద్ధికి చేసిన సేవలు, విద్యార్థులు సాధించిన ప్రగతి, స్కూలుకు హాజరు, విద్యాయేతర కార్యక్రమాల్లో కృషి, తదితర అంశాలను కొలమానంగా తీసుకుని అవార్డులకు అర్హులను ఎంపిక చేస్తుంది. ఈ వడపోత, పరిశీలన, ఎంపికల ప్రక్రియలు సోమ, మంగళవారాల్లో చేపట్ట నున్నారు. వాస్తవానికి వందల సంఖ్యలోనే దరఖాస్తులు వస్తాయని భావించినా గడువు సమీపించేసరికి పట్టుమని ఐదు ప్రతిపాదనలు అందని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎంతఈవేలపై ఒత్తిడి తెచ్చిమరీ టీచర్ల నుంచి దరఖాస్తులు పెట్టించాల్సిన పరిస్థితులు నెలకొన్నట్టు ప్రచారం జరుగుతోంది.

పీజీఆర్ఎస్ దారెటు ?

(3వ పేజీ తరువాయి)

లేదు. వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేయడానికి కింద స్థాయిలో టీమ్‌లు సరిగ్గా పనిచేస్తున్నాయా? అన్నది పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ శాఖల్లో ఉన్న సిబ్బందిలోనే వారంలో ఒకటి, రెండు రోజుల కేటాయించి ఈ సమస్యలపై వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడం, వెంటనే వాటిని పరిష్కరించే మేనేజ్‌మెంట్ అటువైపు సాగితే కొంతలో కొంత ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందన్న భావన అర్జీదారుల్లో వ్యక్తం అవుతోంది.

వ్యయ ప్రయాసలు..

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇచ్చిన ఫిర్యాదునే మళ్లీ ఇవ్వడం వల్ల అర్జీదారులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. కింది స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడం వల్లే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వచ్చి అర్జీ ఇవ్వాల్సి వస్తోందని అర్జీదారులు వాపోతున్నారు. పదేపదే వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఎవరు విఫలమయ్యారో చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానికి ఉంది. మరోవైపు మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిల్లోనే పీజీఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరిగేలా చూడడంతో పాటు, వీటిపైన ఉన్నతాధికారుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తే జిల్లా కేంద్రానికి ఫిర్యాదుదారుల తాకిడి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.


సత్రంపాడు ఏబీసీడీ అపార్టుమెంట్‌లో గణేష్ ఉత్సవాలలో భక్తులు


లింగపాలెంలో గణనాథుడి ఊరేగింపు

బై బై.. గణేశా..

వైభవంగా గణనాథుల విగ్రహాల నిమజ్జనాలు

జిల్లావ్యాప్తంగా వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, పలు సెంటర్లలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల వద్ద ఐదో రోజు ఆదివారం పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జనాలు చేశారు.

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏలూరు- సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద ఉత్సవ గణనాథుడికి భక్తులు సామూహికంగా పలు రకాల పుష్పాలతో అర్చనలు జరిపారు. పవరుపేటలోని విజయ గణపతి స్వామి ఆలయం వద్ద స్వామిని విద్యాగణపతిగా అలంకరించారు. రామకోటి ప్రాంగణంలోని గణనాథుడికి భక్తులు తామర పుష్పాలతో అర్చన నిర్వహించారు. స్థానిక సత్రంపాడు ఏబీసీడీ అపార్టుమెంట్‌లో వినాయక వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. మహిళలు, యువతీ యువకులు, సభ్యులంతా సామూహికంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించి గణనాథుడిని ఊరేగించి కాలువలో నిమజ్జనం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిపారు. అపార్టుమెంట్ నిర్వాహకులు గొట్టాపు శ్రీను, కట్టా రమణ, దారపు పవన్ కుమార్, కొండూరి కిరణ్‌కుమార్ తది తరులు ఉన్నారు.

● చింతలపూడి/లింగపాలెం/కామవరపుకోట : చింతలపూడి పట్టణ పరిధిలోని మారుతీ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, వడ్రగూడెంలోని చవితి మండపం, ప్రగడవరంలోని పోస్టాఫీసు వీధిలోని మండపంలోని వినాయకులను ఊరేగించి నిమజ్జనాలు జరిపారు. లింగపాలెం మండలంలో గణనాథుల నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిమజ్జన సమయంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ కె.వెంకన్న పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కామవరపుకోట మండలం తడికలపూడిలోని శివాలయం సమీపంలో జరిగిన గణేష్ ఉత్సవాల ముగింపు వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● నిడమర్రు/భీమడోలు: నిడమర్రు మండలం నిడమర్రు, తోకలపల్లి, పెదనిండ్ర కొలను, చానమిల్లి, అడవికొలను గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. తోకలపల్లి గ్రామంలో గణపతి నిమజ్జనోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. భీమడోలు మండలం భీమడోలు, గుండుగొలను, పూళ్ళ, పోలసానపల్లి తదితర గ్రామాల్లో గణనాథుని ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. భీమడోలు జంక్షన్‌లోని శ్రీహరి నగర్ కాలనీలోని మహాలక్ష్మి గణపతి ఊరేగింపు నిమజ్జన కార్యక్రమం సందడిగా జరిగింది.

●టి.నరసాపురం/జీలుగుమిల్లి/కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలం మక్కినవారి గూడెం, చినగుర్వాయిగూడెం తదితర గ్రామాల్లో గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. మక్కినవారిగూడెంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు ఆచంట సూర్యనారాయణ, యూవీవీ సత్యనారాయణ, టి.నరసాపురంలో మరీదు వెంకటనాగేశ్వరరావు పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం జీలుగుమిల్లి బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ పాట రూ.23వేలకు, అశ్వారావు పేట శివారు నందమూరుకాలనీకి చెందిన పాలగాని వాసవి, రూ.4వేలకు స్వామి వారి అలంకరణ పట్టు వస్త్రాలు తోట లక్ష్మణ్, సమీరాజా దంపతులు, రూ.3వేలకు గన్నమనేని బోస్, సుబ్బలక్ష్మి దంపతులు పాలవెల్లిని వేలం పాటలో దక్కించుకున్నారు. కొప్పుల శ్రీను, కొట్టే నాగేశ్వరావు, చిట్లూరి రామచందరావు, తదితరులు ఉన్నారు. కొయ్యలగూడెం గణపతి ఆలయంలో జిల్లా ఎస్పీ ప్రశాంత్ కిశోర్ దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన అనంతరం ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న స్వామికి పూజలు చేశారు. కొయ్యలగూడెం ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

నిమజ్జనాల్లో నిబంధనలు పాటించండి : ఎస్పీ


నిమజ్జన ప్రదేశానిన పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం,ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : వినాయక నిమజ్జనం కార్యక్రమా లలో నిబం ధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. నగరంలోని తూర్పు మడమర లాకుల వద్ద వినాయక నిమజ్జనానికి ఏర్పాటు చేసిన ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. భక్తులు వినాయక నిమజ్జనం సమయంలో విగ్రహంతో పాటు నీటిలోకి దూకరాదని సూచించారు. నిమజ్జనం ర్యాలీలలో డీజేలు వినియోగించరాదని, అశ్లీల నృత్యాలకు వేయించినట్లయితే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు, ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

లోన్ యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలి..

లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిశోర్ ప్రజలకు సూచించారు. మొబైల్ ఫోన్లకు వాట్సాప్‌లో మెస్సేజ్‌లు, లింకులను సైబర్ నేరగాళ్లు పంపిస్తున్నారని ఇలాంటి నేరగాళ్ళ మోసాలపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసరానికి సరైన గుర్తింపు ఉన్న బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల నుంచి రుణాలు తీసుకోవాలని, అనధికారికంగా పని చేసే యాప్‌ల నుంచి సొమ్ములను తీసుకోవద్దని సూచించారు. ఓటీపీలు ఎవరికి చెప్పవద్దని అన్నారు. ప్రజలు సైబర్ నేరాల వలలో చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వినాయకుడికి 1,008 రకాల నైవేద్యం



ఏలూరు రూరల్ : స్థానిక తూర్పు వీధి, చీదర బోయిన వారి వీధి వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 1,008 రకాల నైవేద్యాన్ని సమర్పించారు. ఈఎస్‌వై యూత్ ఆధ్వర్యంలో తృతీయ గణపతి నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పండ్లు, గారెలు, బూరెలు, పలు రకాల స్వీట్లు, 1008 రకాల నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.భగవాన్, ఈ.సాయి, ఎన్.అప్పారావు, ఎన్.లీలాకృష్ణ, కె.గిరిధర్, ఈ.కళ్యాణ్‌సాయి పర్యవేక్షించారు.

అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు

ఏలూరుటూటౌన్/కార్పొరేషన్/చింతలపూడి/జంగారెడ్డిగూడెం : గణేష్ ఉత్సవాల నిర్వహణ వల్ల ప్రజల్లో భక్తిభావాలు పెరిగాయని, తద్వారా శాంతి, సౌభాగ్యం నెలకొంటుందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ఆదివారం మూడో డివిజన్‌లో గణేష్ ఉత్సవా లు ముగింపు సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, ఏలూరు నగర సొసైటీ బ్యాంకు చైర్మన్ అమరావతి అశోక్, డివిజన్ నాయకులు జాలా బాలాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నగరంలోని వైఎస్సార్‌కాలనీ, మరడాని రంగారావు కాలనీ, నవాబ్‌పేట, నాగేంద్రకాలనీలలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. చింతలపూడి పట్టణంలోని వెలమపేటలోని వినాయక విగ్రహం వద్ద ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పూజలు జరిపి అనంతరం భోజనాలు వడ్డించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని రామచంద్రాపురం వినాయకుడి ఆలయం వద్ద, లక్ష్మీగణపతి టౌన్‌షిప్ వద్ద అన్నదాన కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, మహంకాళి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.




ఏలూరు, చింతలపూడిల్లో అన్నప్రసాద వితరణలో ఎమ్మెల్యేలు బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్

మక్కినవారిగూడెం, టి.నరసాపురం సొసైటీల చైర్మన్‌లుగా

సూర్యనారాయణ, సోంబాబు


సూర్యనారాయణ సోంబాబు

టి.నరసాపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మక్కినవారిగూడెం, టి.నరసాపురం సొసైటీలకు చైర్మన్లుగా ఆచంట సూర్యనారాయణ, జోనుబోయిన సోంబాబు ఎంపిక య్యారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా మండలంలో ఐదు సొసైటీలకు గాను మూడు సొసైటీల చైర్‌పర్సన్‌లను ప్రకటించగా మక్కినవారిగూడెం, టి.నరసాపురం సొసైటీల కమిటీలను ప్రకటించలేదు. ఆదివారం అధికారులు ప్రకటించిన కమిటీల్లో మక్కినవారిగూడెం సొసైటీ సభ్యులుగా నరదల సత్యనారాయణ, దాసరి వెంకటలక్ష్మి, టి.నరసాపురం సొసైటీ సభ్యులుగా మోదుగ వెంకటరామారావు, ఉయ్యూరి నాగమయిలను ఎంపిక చేశారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయం ఆదివా రం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి భక్తుల రాక ప్రారంభమైంది. దేవస్థానంలో అన్ని విభాగాలు భక్తులతో రద్దీగా కనిపించా యి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. 12 వేలమందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారుల అంచనా. శ్రీవారి ఉచిత దర్శనానికి గంట సమయం పట్టింది. దర్శనానంతరం స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం రద్దీ కాస్త తగ్గుముఖం పట్టింది.

క్రెడిట్ కార్డుతో రూ.29 వేలు కొట్టేశారు

ఏలూరు క్రైం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డుతో రూ.29 వేలు అపహరణకు గుర య్యాయని బాధితుడు రెండో పట్టణ పోలీ సులకు ఫిర్యాదు చేశాడు. ఏలూరు టూటౌన్ పరిధిలోని పెన్షన్‌లైన్ ప్రాంతానికి చెందిన కే చార్లీ విలియమ్స్ క్రెడిట్ కార్డు నుంచి కొద్దిరోజుల క్రితం రూ.29 వేలు డెబిట్ అయ్యా యి. అతడు ఏవిధమైన ట్రాన్సాక్షన్స్ చేయలేదు. పాస్‌వర్డ్ కూడా ఎవరికి చెప్పలేదు. ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్‌తో రూ.29 వేలు డెబిట్ అయినట్లు రెండు రోజుల తర్వాత గమనించాడు. దీనితో తన క్రెడిట్ కార్డు నుంచి డబ్బులు అపహ రణకు గురయ్యాయని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీ సుబ్బారావు మృతితో బుట్టాయగూడెంలో విషాదచాయలు

బుట్టాయగూడెం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):మూడు రోజుల క్రితం విధి నిర్వహణలో ఉండగా కానరాకుండా పోయిన ఇంటెలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ బుడుపుల సుబ్బారావు ఎర్ర కాలువలో శవంగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. బుట్టాయగూడెంలో విషాద చాయలు అలుముకున్నాయి. బుట్టాయగూడెంలో పుట్టి పెరిగిన అతడికి ఏజెన్సీలో అందరితో మంచి సంబంధాలే ఉన్నాయి. వివాద రహితుగా పేరు తెచ్చుకున్నారు. శుక్రవారం రాత్రి 10.30 గంటలకు చివరిసారిగా కుటుంబ సభ్యులతో మాట్లాడారని, ఆ తర్వాత నుంచి ఫోన్ అందుబాటులో లేదని కుటుంబ సభ్యులు విలపించారు.

హెచ్‌సీ మృతి తీరని లోటు : ఎమ్మెల్యే బాలరాజు

జంగారెడ్డిగూడెం:వరద ప్రవాహంలో ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు అకాల మృతి ఆయన కుటుంబానికి, పోలీసు శాఖకు తీరని లోటని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో అతడి మృతదేహాన్ని సందర్శించి మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలి

» 4న జరిగే రాష్ట్రస్థాయి కోకో సదస్సును విజయవంతం చేయాలి : శ్రీనివాస్

పెదవేగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలని, అప్పుడే కోకో రైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయరాయిలో ఆదివారం జరిగిన కోకో రైతు సంఘం కార్యవర్గ సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించారు. అదేవిధంగా ఈనెల 4వ తేదీన విజయరాయిలో నిర్వహించే కోకో రైతుల రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కోకో రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధరను కల్పిస్తే కోకో రైతులు లబ్ధి పొందుతారని ఆయన చెప్పారు. గత సీజన్‌లో కోకో రైతులు వందల కోట్ల రూపాయలు నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర వచ్చేలా ఫార్ములా రూపొందించాలని డిమాండ్ చేశారు. కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, మున్నంగి సుబ్బారెడ్డి, పాలడుగు నరసింహారావు, కోనేరు సతీష్‌బాబు, నాయకులు మోరంపూడి సుబ్రహ్మణ్యం, ఆలపాటి శ్రీనివాసరావు, గుంటూరి వెంకటరాజు, తేజాకృష్ణ పాల్గొన్నారు.

సంచార జాతులకు అండగా ఉంటాం : ఘంటా పద్మశ్రీ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు రూరల్, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి) : సంచారులు గౌరవంగా బతికేలా చేస్తామని వారికి అండగా నిలుస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వరప్రసాద్ అన్నారు. గిరిజన సంక్షేమ సంఘం వర్కింగ్ అధ్యక్షుడు అన్నపరెడ్డి మురళి అధ్యక్షతన ఆదివారం స్థానిక లేడీస్ క్లబ్‌లో సంచార జాతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ సంచారులు విద్యపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు అన్నపురెడ్డి మురళి మాట్లాడుతూ సంచార తెగల విద్యార్థులకు ప్రత్యేక గురుకుల పాఠశాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ఘంటశాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో కుల గణన చేసే సమయంలో సంచార జాతులు తెగులు, వారి వివరాలు నమోదు చేయించుకోవాలని ముఖ్యంగా ఆధార్‌కార్డు పొందాలన్నారు. అనంతరం డాక్టర్ లంక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంచారులను ఎస్టీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. తాడిశెట్టి గోపి, లక్కోజు గోపి, ఉక్కుసూరి గోపాలకృష్ణ, జావీదు, వరలక్ష్మి, జి.సుధాకర్, ఎం.గురవయ్య, కత్తుల మణి, ఎస్‌వీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు నందిని ఎంపిక


నందిని

ఏలూరు రూరల్, ఆగస్టు 31, (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి 75వ జూనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్‌కు కస్తూరిబా పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.నందిని ఎంపికైందని హెచ్‌ఎం కె.మాధవి లత తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు పంజాబ్ రాష్ట్రం లుథియానాలో జరిగే పోటీల్లో నందిని ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి 10వ అంతర జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. పోటీలకు ఎంపిక కావడంపై బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ట్రెజరర్ కె.మురళికృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

'శివ కుమార్ సేవలు ఆదర్శనీయం'



శివకుమార్‌ను సన్మానిస్తున్న సుంకర రాము

ఏలూరు క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువ కేంద్ర ఏలూరు జిల్లా కార్యాలయంలో అకౌంట్స్ అండ్ ప్రోగ్రామ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎంవీ శివకుమార్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఏలూరు లక్ష్మీవారపుపేటలో ఉన్న నెహ్రూ కేంద్ర కార్యాలయంలో జాతీయ సేవా కార్యకర్తలు, యువజన సంఘాల ప్రతినిధులు, ఆ కార్యాలయ ఉద్యోగులు కలిసి శివకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ శివకుమార్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. నవజ్యోతి యూత్‌క్లబ్ అధ్యక్షుడు చింతా గోపాలకృష్ణ, అక్షర యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కుసుమరత్నం, సాధన రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు ఏసుపాదం, సంధ్య పలువురు పాల్గొన్నారు. శివకుమార్ ఆయన సతీమణిని దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సత్తెన్నగూడెంలో బీసీ శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

ద్వారకాతిరుమల, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మండలంలోని సత్తెన్నగూడెంలో బీసీలకు శ్మశాన వాటికకు ఓ దాత సహకారంతో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్థలాన్ని కేటాయించారు. గ్రామానికి చెందిన దాత తాండ్ర కృష్ణప్రసాద్ గ్రామస్థుల అవసరాలమేరకు తన సొంత భూమిలో ఐదు సెంట్ల స్థలానిన పంచాయతీకి రాసి ఇచ్చారు. ఆ భూమిని బీసీ సామాజిక వర్గానికి శ్మశాన వాటికకు ఉపయోగించాలని పత్రంలో రాశారు. ఎన్నికల ప్రచార సమయంలో మద్దిపాటి ప్రచారం చేస్తున్న సమయంలో గ్రామంలో బీసీలకు శ్మశానవాటిక లేదని ఆయనకు విన్నవించారు. దీనిలో భాగంగా సర్పంచ్ కోటగిరి రమాదేవి సోదరుడు తాండ్ర కృష్ణప్రసాద్‌ను ఒప్పించి కొంత స్థలాన్ని ఇవ్వమని ఎమ్మెల్యే కోరడంతో స్పందించిన ఐదు సెంట్ల స్థలాన్ని కృష్ణప్రసాద్ అందజేశారు. పలువురు బీసీ నేతలు, స్థానికులు స్థలమిచ్చిన దాతను, దీనికి కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

హైవేపై గోతులు పూడ్చివేత

జీలుగుమిల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతం తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి వరకు జాతీయ రహదారి పూర్తిగా పాడైంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డును ఎన్‌హెచ్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక స్థానికులు, వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు ఎస్ఐ విక్రాంతికుమార్ ఆదివారం ఎక్స్‌కవేటర్ సాయంతో రహదారిపై గోతులు సరిచేయించారు.

రత్తయ్యకు ఉద్యోగ విరమణ సన్మానం

దెందులూరు,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమల మండల అధికారిగా పనిచేసిన గోకవరపు రత్తయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టు పరిశ్రమల శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మెట్ట గ్రామాల్లో పట్టు పురుగుల పెంపకంతో పాటు సాగు విస్తరించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. అనంతరం ఏలూరు పట్టు పరిశ్రమల శాఖ కార్యాలయంలో రత్తయ్య దంపతులను సన్మానించారు. అధికారులు ఎస్.రమేష్, జయశ్రీ, పోలవరం ఎమ్మెల్యే తండ్రి చిర్రి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఉంగుటూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించనున్న 33 కేవీ నిడమర్రు ఫీడర్ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు రావులపర్రు, రాచూరు, సీతారాంపురం గ్రామాల చేపల చెర్వుల యజమానులకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

గొర్రెలు, మేకల సంత ఏర్పాటుకు చర్యలు

ఆగిరిపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంసీలో గొర్రెలు, మేకల సంత ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులతో నూజివీడు ఏఎంసీ కార్యదర్శి సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా లైవ్ స్టాక్ సంఘం అధ్యక్షుడు డీవీ కృష్ణారావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ త్వరలో సంత ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, ఆగిరిపల్లి టీడీపీ పట్టణ అధ్యక్షుడు పామర్తి నరసయ్య, చిట్నేని శివరామకృష్ణంరాజు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కైకలూరులో నూతన విద్యుత్ లైన్ల నిర్మాణం కోసం ఆటపాక ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కైకలూరులోని ఏలూరు రోడ్డు, వైఎస్సార్ కాలనీ, జాన్‌పేట, ఆటపాక పరిధిలో గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అందరికీ పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు

ముదినేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సెప్టెంబరు నెలకు యథావిధిగా అందనున్నాయి. రీ వెరిఫికేషన్‌లో అనర్హులుగా గుర్తించి నోటీసులు జారీ చేసిన దివ్యాంగులకు కూడా ఈ నెల పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. ముదినేపల్లి మండలంలో 8787 మంది వివిధ కేటగిరీల పెన్షన్‌దార్లకు రూ. 3,82,50,000లు పెన్షన్ సొమ్మును అందజేయనున్నట్లు ఎంపీడీవో వై. రామకృష్ణ తెలిపారు. మండలంలో రీ వెరిఫికేషన్‌లో 91 మంది దివ్యాంగులను వైద్యులు అనర్హులుగా గుర్తించడంతో వారికి అధికార్లు పెన్షన్‌ను రద్దు చేస్తూ ఇటీవల నోటీసులు జారీ చేసి, అప్పీలుకు అవకాశం కల్పించారు. నోటీసులు అందుకున్న వారందరూ ఆగస్టు నెలాఖరులోగా అప్పీలు చేసుకోగా వారి పేర్లను మండల పరిషత్ అధికార్లు ఆన్‌లైన్ చేశారు. దీంతో వారికి కూడా ఈ నెల పెన్షన్ ఇస్తామని అధికార్లు తెలిపారు. కాగా అనర్హత నోటీసులు అందుకున్న దివ్యాంగుల అర్హతపై త్వరలో తిరిగి రీ వెరిఫికేషన్ చేస్తారని కూడా తెలిపారు.

నూజివీడు మండలంలోను..

నూజివీడు టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలంలో పెన్షన్లు తీసుకుంటూ నోటీసులు అందుకున్న 10 మంది మాత్రమే పించన్లు కోసం అప్పీలు చేసుకోలేదని, అయితే ప్రతి ఒక్కరికీ యథావిధిగా పించన్లు పంపిణీ చేయడం జరుగుతుందని నూజివీడు ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. నూజివీడు మండలంలోని మొత్తం 29 గ్రామాల పరిధిలో 270 మందికి దివ్యాంగ పించన్ల రీ వెరిఫికేషన్ నోటీసులు అందాయన్నారు. వీరిలో మండలంలో 10 మంది తప్ప 260 మంది పించన్లు కోసం అప్పీలు చేసుకున్నారన్నారు. అయితే ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ పించన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అప్పీల్ చేసుకోని వారు తిరిగి అప్పీలు చేసుకునే అవకాశం ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

11, 12 తేదీల్లో 'కళా ఉత్సవ్-2025' పోటీలు

ముదినేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో కళారంగానికి సంబంధించిన సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కార్యక్రమాల్లో భాగంగా సమగ్ర శిక్షా అభియాన్ కళా ఉత్సవ్ -2025ను నిర్వహించ తలపెట్టింది. పూర్వపు కృష్ణాజిల్లా స్థాయిలో సెప్టెంబరు 11, 12 తేదీల్లో అంగలూరు ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సంగీతం, నృత్యం, నాటకం, మిమిక్రీ, విజువల్ ఆర్ట్స్ (త్రీడీ శిల్పం), నృత్యం, నాటకం, సంగీతం ద్వారా సాంప్రదాయ కథలు చెప్పటం అనే అంశాలపై ప్రదర్శనలు నిర్వహిస్తామని డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె. లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మోడల్ పాఠశాలలకు చెందిన తొమ్మిది, పది, ఇంటర్ విద్యార్థులు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, పాల్గొనే విద్యార్థులు సెప్టెంబర్ 5లోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పేదలకు ఉచిత వైద్య సేవలు భేష్ : కామినేని



మండవల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పళ్లెం పెద్దేశ్వరరావు ఆసుపత్రి యాజమాన్యం పేదలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. లోకుమూడి దత్తాశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, దత్తాశ్రమం కార్యనిర్వహణాధికారి గురజాడ ఉదయశంకర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ



డాక్టర్ శ్రీనివాసరావు

ఏలూరు క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఏరియా ఆసుపత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. మచిలీపట్టణానికి చెందిన ఆయన పెదపాడు పీహెచ్‌సీ వైద్యుడిగా చేరి ఆ తరువాత ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చీఫ్ ఫిజీషియన్‌గా విధులు నిర్వర్తించారు. ముఖ్యంగా కొవిడ్ మహమ్మారి ప్రాణాంతకంగా ఉన్న పరిస్థితుల్లో ఆయన బృందం చేసిన సేవలు మరువలేనివి. ఆయన సేవలను గుర్తించి ఆ కాలంలోనే విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో రాష్ట్రస్థాయి లోనే కరోనా వైద్యసేవ సలహాదారునిగా ప్రభుత్వం నియమించి సేవలను వినియోగించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ కాలేజీగా మారినప్పటికీ ఈ ఏడాది జనవరి వరకు సేవలు అందించారు. ఆ తరువాత నూజివీడు బదిలీ చేశారు. ఆయన ఎన్నో ఉత్తమ వైద్య సేవ అవార్డు లను అందుకున్నారు. నూజివీడు, ఏలూరు ప్రాంతాల్లో పలు తేదీల్లో ఆయనను సన్మానించేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పీజీఆర్ఎస్ దారెటు?

(3వ పేజీ తరువాయి)

లేదు. వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేయడానికి కింద స్థాయిలో టీమ్‌లు సరిగ్గా పనిచేస్తున్నాయా? అన్నది పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివిధ శాఖల్లో ఉన్న సిబ్బందిలోనే వారంలో ఒకటి, రెండు రోజుల కేటాయించి ఈ సమస్యలపై వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయడం, వెంటనే వాటిని పరిష్కరించే మేనేజ్‌మెంట్ అటువైపు సాగితే కొంతలో కొంత ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందన్న భావన అర్జీదారుల్లో వ్యక్తం అవుతోంది.

వ్యయ ప్రయాసలు..

జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇచ్చిన ఫిర్యాదునే మళ్లీ ఇవ్వడం వల్ల అర్జీదారులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. కింది స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడం వల్లే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌కు వచ్చి అర్జీ ఇవ్వాల్సి వస్తోందని అర్జీదారులు వాపోతున్నారు. పదేపదే వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఎవరు విఫలమయ్యారో చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానికి ఉంది. మరోవైపు మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిల్లోనే పీజీఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరిగేలా చూడడంతో పాటు, వీటిపైన ఉన్నతాధికారుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తే జిల్లా కేంద్రానికి ఫిర్యాదుదారుల తాకిడి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మాకొద్దులే!

(3వ పేజీ తరువాయి)

అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, సంబంధిత టీచర్లు విద్యారంగ అభివృద్ధికి చేసిన సేవలు, విద్యార్థులు సాధించిన ప్రగతి, స్కూలుకు హాజరు, విద్యాయేతర కార్యక్రమాల్లో కృషి, తదితర అంశాలను కొలమానంగా తీసుకుని అవార్డులకు అర్హులను ఎంపిక చేస్తుంది. ఈ వడపోత, పరిశీలన, ఎంపికల ప్రక్రియలు సోమ, మంగళవారాల్లో చేపట్ట నున్నారు. వాస్తవానికి వందల సంఖ్యలోనే దరఖాస్తులు వస్తాయని భావించినా గడువు సమీపించే సరికి పట్టుమని ఐదు ప్రతిపాదనలు అందని దుస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎంఈవోలపై ఒత్తిడి తెచ్చిమరీ టీచర్ల నుంచి దరఖాస్తులు పెట్టించాల్సిన పరిస్థితులు నెలకొన్నట్టు ప్రచారం జరుగుతోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475





ముసునూరు ఎస్సీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్తిన 11 కేవీ విద్యుత్ లైన్

ఇళ్లను ఆనుకునే హై టెన్షన్ వైర్లు!

- బిక్కుబిక్కుమంటున్న కాలనీ వాసులు
- సొమ్మిస్తేనే తొలగిస్తామంటున్న అధికారులు
- కూలీలమైన తామెక్కడి నుంచి తెస్తామంటున్న బాధితులు
- మంత్రి ఆదేశాలు బేఖాతర్

ముసునూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎస్సీ కాలనీలో నివాస గృహాలపై ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ తీగెలు ఉండటంతో కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. మూడేళ్ళ నుంచి ఈ విద్యుత్ లైన్‌ను తొలగించాలని ప్రజాప్రతినిధులు, ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా స్పందన లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలో 50 నివాస గృహాల మీదుగా విద్యుత్ తీగలు ఇళ్లను ఆనుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాకాలంలో ఇవి పలుమార్లు తెగిపడ్డాయని, ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని కాలనీవాసులు చెబుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు మాత్రం నగదు చెల్లిస్తేనే లైన్ తొలగిస్తామని చెబుతున్నారని, కూలి చేసుకుంటూ జీవనం సాగించే దళితులమైన తాము లక్షల్లో నగదు చెల్లించలేమని కాలనీవాసులు వాపోయారు. ఈ సమస్యపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ కూడా దాఖలు చేయడంతోపాటు, ఇటీవల మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన ట్రాన్స్‌కో డీఈఈతో మాట్లాడి లైన్ మార్పిడికి అంచనాలు తయారు చేయాలని ఆదేశించినా నేటికీ అధికారులు ఆ దిశగా పనులు చేపట్టలేదని కాలనీవాసులు ఆరోపించారు.

నిప్పు రవ్వలు రాలుతున్నాయి...



మా ఇంటి నడికప్పుపైన 11 కేవీ విద్యుత్ తీగలు ఆనుకుని ఉన్నాయి. ఈదురు గాలులకు ఈ తీగలు నుంచి నిప్పురవ్వలు రాలుతున్నాయి. తీగలు తెగి పడితే ఇంటిల్లపాది షాక్‌కు గురికావాల్సిందే. వీటిని తొలిగించాలి.

- దుక్కిపాటి ఇజ్రాయేలు,
ఎస్సీ కాలనీ వాసి, ముసునూరు.

సొమ్ము చెల్లిస్తేనే తొలగింపు...

ముసునూరు ఎస్సీ కాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్ తొలగింపునకు ఎస్టిమేట్ వేయమని మంత్రి పార్థ సారథి చెప్పినమాట వాస్తవమే. అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యుత్ లైన్ తొలిగించాలంటే ఎస్టిమేట్ ప్రకారం బాధితులు నగదు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు బాధితులు ముందుకు వస్తే తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

- ఎ.సత్యనారాయణ,
ట్రాన్స్‌కో డీఈ, నూజివీడు

తొలగని ప్రతిష్ఠంభన

ఐదు పీఏసీఎస్‌లకు

ఖరారు కాని త్రిసభ్య కమిటీలు

ముదినేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో పెండింగ్‌లో ఉన్న ఐదు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీల ఏర్పాటు ఓ కొలిక్కి రాలేదు. ప్రభుత్వం నాలుగో విడతగా జాబితాలు విడుదల చేసినా మండలంలోని సంఘాలకు త్రిసభ్య కమిటీల ఏర్పాటు పూర్తి కాలేదు. మండలంలో 15 పీఏసీఎస్‌లు ఉండగా, తొలి జాబితాలో తొమ్మిదింటికి మూడవ జాబితాలో ఒక పీఏసీఎస్‌కు త్రిసభ్య కమిటీల నియామకం జరగ్గా, మిగిలిన ఐదు కమిటీల నియామకం రెండు నెలలుగా పెండింగ్‌లోనే ఉంది. ముదినేపల్లి, గురజ, దేవపూడి, పెనుమల్లి, దాకరం పీఏసీఎస్‌లకు కమిటీల ఏర్పాటు జరగనే లేదు. మండలంలోని అన్ని సంఘాల కు కమిటీల ఏర్పాటుకు పేర్ల జాబితాలను శాసన సభ్యుడి ద్వారా సహకార ప్రిన్సిపాల్ కార్యదర్శికి పంపినా ఇప్పటి వరకు పది సంఘాలకే కమిటీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. పెండింగ్ సంఘాల కమిటీల ఏర్పాటుకు సంబంధించి చైర్మన్ అభ్యర్థుల ఖరారులో అభ్యంతరాలు ఎదురుకావటం, కూటమి నాయకుల్లో నెలకొన్న అసంతృప్తి కారణంగానే పై ఐదు సంఘాల త్రిసభ్య కమిటీల నియామకాన్ని నిలిపేసినట్టు తెలిసింది.

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు సత్కారం

ముదినేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్‌ను ముదినేపల్లి బ్రాంచి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల సీఈవోలు, బ్రాంచి సిబ్బంది సత్కరించారు. ఆదివారం విజయవాడలో జిల్లా స్థాయిలో సహకార బ్యాంకుల అధికారులు, పీఏసీఎస్ ఉద్యోగులు నిర్వహించిన అభినందన సభలో ముదినేపల్లి సహకార బ్యాంకు బ్రాంచి సూపర్‌వైజర్ నాగభూషణం, పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ ఉపాధ్యక్షుడు పల్లెం శ్రీనివాసరావు, నాయకులు అల్లాడ దుర్గారావు, లంక ప్రసాద్, ఉద్దంటి వెంకటేశ్వరరావు, పాలంకి వెంకటేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో సంఘాల సీఈవోలు, ఉద్యోగులు రఘురామ్‌ను సన్మానించారు.



అవార్డు అందుకుంటున్న దండే బెనర్జీ



పురస్కారాన్ని అందుకుంటున్న శిఖా ఆకాశ్

దండే బెనర్జీ, శిఖా ఆకాశ్‌కు తెలుగుతేజం అవార్డులు

కైకలూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సహజ కవి దండే బెనర్జీకి తెలుగుతేజం అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. అనేకమంది కవుల సాహితీ రచనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కైకలూరుకు చెందిన దండే బెనర్జీ రచనలకు గాను తెలుగుతేజం అవార్డును శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్థసారథి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణం చేతుల మీదుగా అందజేశారు. మహిళా అధ్యక్షురాలు చిట్టి లలిత, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిఖా ఆకాశ్‌కు..

నూజివీడు టౌన్: గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని అభ్యుదయ కవి శిఖా ఆకాష్ 'తెలుగు తేజం' పురస్కారం అందుకున్నారు. ఆదివారం నరసరావుపేటలో అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక కళా రంగాలకు సంబంధించిన శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు గడ్డం ఈశ్వరీ తదితరులు నూజివీడుకు చెందిన శిఖా ఆకాశ్‌కు పురస్కారం అందించారు. అవార్డు గ్రహీతను నూజివీడుకు చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

'బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన విజయవంతం చేయాలి'



నాయకులతో మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షురాలు నాగరాణి

నూజివీడు, ఆగస్ట్ 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సెప్టెంబరు 3న ఏలూరులో జరిపే పర్యటన విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ఆ పార్టీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి అన్నారు. నూజివీడులో ఆదివారం పార్టీ పట్టణ సమావేశానికి నాగరాణి అధ్యక్షత వహించారు. పట్టణ పరిధిలోని ప్రతి బూత్ నుంచి పార్టీ కార్యకర్తలు, రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనలో పాల్గొనే విధంగా నాయకులు కార్యాచరణ రూపొందించాలని కోరారు. పార్టీ కోశాధికారి, కార్యక్రమ ఇన్‌చార్జ్ మాటూరి రవికాంత్ జనసమీకరణ, రవాణా సదుపాయం తదితర ఏర్పాట్లపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బోను అప్పారావు, నాయకులు వై.ఎస్ దొరై, ఎం.రాజశేఖర్, కొండయ్య సత్రం చైర్మన్ మాటూరి ప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శులు దోసపాటి మల్లిఖార్జున జగదీష్, దద్దనాల రవికిషోర్, సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై ప్రవహిస్తున్న చేపల చెరువుల నీరు

రహదారిపైకే చెరువు నీరు

మండవల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం మూడుతాళ్లపాడు, ఇంగిలిపాకలంక రోడ్డుపైకి చేపలచెరువుల నీళ్ల పారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోల్‌రాజ్ డ్రెయిన్ పక్కనే ఉన్న 100 ఎకరాల చేపల చెరువు నుంచి శుక్రవారం సాయంత్రం నీటిని బయటకు విడుదల చేశారు. కాలువలన్నీ నీటితో నిండుగా ఉండడంతో విడుదల చేసిన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఇంగిలిపాకలంక రోడ్డుపై నుంచి వెళ్తున్నాయి. దీంతో ఆనందపురం, ఇంగిలిపాకలంక, ఉనికిలి, నందిగామలంక, పెనుమాకలంక గ్రామాల ప్రజలు ఆ నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారులు మరమ్మతులకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం కిటకిట

ముదినేపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పుట్టలో పాలు పోసి, సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు. అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాల గంగాధర్ తిలక్ పూజలు, అభిషేకాలు జరిపారు. మహిళలు నాగమల్లి చెట్టు కింద నాగ ప్రతిమకు ప్రత్యేక పూజలు జరిపారు.



ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో మృతదేహాలు

గణేశ్ ఉత్సవాల్లో విషాదం

నిమజ్జన ఊరేగింపులో నలుగురి దుర్మరణం

- యువకులపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్
- ఈమన వారి మెరక నుంచి నరసాపురం గోదావరి వద్దకు ఊరేగింపు
- తూర్పుతాళ్ల వద్ద ఘటన
- ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్ పరామర్శ

మొగల్తూరు/నరసాపురం రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జన ఊరేగింపులో ఆదివారం రాత్రి అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపులో డ్యాన్స్ చేస్తు న్న బృందంపై వినాయక విగ్రహం ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా దూసుకుపోయింది. ఈ సంఘటనలో నలుగురు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నరసాపురం మండలం తూర్పుతాళ్ల గ్రామంలో జరిగిన సంఘటనపై పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈమన వారి మెరకలో వినాయక చవితి సందర్భంగా 15 అడుగుల గణనాథుడి విగ్రహన్ని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు ఆదివారం నిమజ్జన ఊరేగింపు చేపట్టారు. నరసాపురం వద్ద గోదా వరిలో నిమజ్జనం చేయడానికి గ్రామం నుంచి ఊరేగిం పుగా బయలుదేరారు. కొద్దిదూరం వెళ్లగానే ట్రాక్టర్ ముందు యువకులు నృత్యాలు చేస్తుండగా కమిటీ సభ్యులు గొడవ జరగకుండా గమనిస్తున్నారు. ఆ సమయంలో ట్రాక్టర్ ఒక్కసారిగా నృత్యం చేస్తున్న వారిపై దూసుకు వెళ్లింది. ఈ సంఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఇద్దరిని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి, మరో ఇద్దరిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. యివన సూర్యనారాయణ (58) అక్కడికక్కడే మృతిచెందగా తిరుమల నర్సింహమూర్తి (35), గురుజు మురళి (38), కడియం దినేష్ (9) మృతి చెందినట్టుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ కంచర్ల ప్రసాద్‌ను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.

తీరంలో దిగ్భ్రాంతి

ఈ సంఘటనతో తీర ప్రాంతం ఉలిక్కిపడింది. గత మూడు రోజులుగా నిమజ్జనం సమయంలో పటిష్ట చర్యలు చేపట్టాలని పోలీస్ ఐజి అశోక్, ఎస్పీ నయీం, డీఎస్పీ శ్రీవేద సూచించారు. ఈ నేపథ్యంలో ఐదో రోజు గురువారం నరసాపురం పట్టణ, మండలంతో పాటు పాలకొల్లు ప్రాంతం నుంచి పలు విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం చేసేందుకు తరలివచ్చాయి. ఏఎస్పీ భీమారావు పోలీస్ బందోబస్త్‌తో వలంధర్ రేవు వద్ద ఉండి నిమజ్జన కార్యక్రమాలు పరిశీలిస్తున్నారు. తూర్పుతాళ్ల లో నిమజ్జన ఊరేగింపులో ట్రాక్టర్ యువకులపై దూసుకువెళ్లిందన్న సమాచారంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన రెవెన్యూ, మొగల్తూరు పోలీసులు గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో తరలించారు.

ఎమ్మెల్యే, ఎస్పీ, కలెక్టర్ పరామర్శ

సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నాయకర్ ఆసుపత్రులకు వెళ్లి మృతదేహాలను సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రమాద వివరాలను కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ ఆయనకు వివరించారు. గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని నాయకర్ ఆదేశించారు.



కైకలూరులో లడ్డూ దక్కించుకున్న భక్తుడు



నూజివీడులో గణనాథుడి నగరోత్సవం



ఆగిరిపల్లి మండలం కొత్తపేటలోని బాలగణేష్



కోరుకొల్లులో చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు

ఊరేగింపులు.. నిమజ్జనాలు

కైకలూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా గణనాథులకు పూజలు, నిమజ్జనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మండలంలోని వరహాపట్నంలో ఆది వినాయకస్వామిని, కైకలూరు వెలమపేటలోని స్వామివారిని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఊరేగింపులో యువత రంగులు చల్లుకుంటూ తీన్మార్ వాయిద్యాల నడుమ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కైకలూరు ఎన్జీవోస్ కాలనీలోని స్వామివారిని ఊరేగించారు. వైఎస్సార్ కాలనీలోని ఆది వినాయకస్వామికి ఆరేపల్లి సత్యనారా యణ దంపతులు పూజలు నిర్వహించగా లడ్డూను వేలంలో రూ.4600కు జొన్నలగడ్డ నాగరాజు దక్కించుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు, యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు.

కలిదిండి: మండలంలో గణపతి నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయకుడి విగ్రహం వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కోరుకొల్లు సంత మార్కెట్ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద విద్యాభారతి అకాడమీ ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థుల కూచిపూడి, భరత నాట్యం ప్రేక్షకులను అలరించింది.

ముదినేపల్లి: మండలంలోని దేవపూడి ముఖ్య కూడలి ప్రదేశంలోని రావి చెట్టు కింద మండపాన్ని నిర్మించి వినాయకుడిని ప్రతిష్టించి చవితి ఉత్సవాలను అనాదిగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అయిదున్నర అడుగుల ఎత్తుగల మట్టి వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రులను జరుపుతున్నారు. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. ముదినేపల్లిలోని వై.జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి మంటపంలో టీడీపీ నాయకులు చల్లగుళ్ల ఆదిత్య చౌదరి తదితరులు పూజలు చేశారు.

మండవల్లి: మండవల్లిలో చిన్నారులంతా కలసి ఆదివారం పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండవల్లి శివాలయం వీధిలో చిన్నారులు వినాయకుడి విగ్రహం పెట్టి భక్తిశ్రద్ధలతో 3 రోజులు పాటు ప్రత్యేక పూజలు చేశారు.

నూజివీడు నియోజకవర్గంలో...

నూజివీడు టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రుల్లో ఐదవ రోజు ఆదివారం నూజివీడు పట్టణంలోని పలు కూడళ్ళల్లో పూజలు అందుకున్న గణనాథులను నిమజ్జనం కార్యక్రమాలకు తరలించారు. నూజివీడు నియోజకవర్గం శాసనసభ్యుడు, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి క్యాంప్ కార్యాలయంలో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామోత్సవంతో నిమజ్జనం కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవ కమిటీలు ఆదివారం భారీ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. నూజివీడు మండలం జంగం గూడెంలో, అన్నవరం శివారు వెంకటాద్రిపురంలో, దిగవల్లి యాదవుల బజారులోను ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధనలు జరిగాయి.

ముసునూరు: మండల వ్యాప్తంగా చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో రోజు ముసునూరు పడమట రామాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లిబోయిన సుబ్బారావు, పాకనాటి లక్ష్మణ చందు, పాకనాటి శశాంక్‌లు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని రూ. 40 వేలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం స్వామివారిని ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు.

చాట్రాయి: మండలంలోని చాట్రాయి, చిన్నంపేట, ఆరుగొలనుపేట, చీపురుగూడెం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాల ఊరేగింపులు, అన్నదానాలు నిర్వహించారు. గణనాథుల విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి ఘనంగా ఊరేగించారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనాలు చేశారు.

ఆగిరిపల్లి: మండలంలో ఏర్పాటు చేసిన సుమారు 75 గణేష్ మండపాలలో నవరాత్రులు సందర్భంగా గణనాధుడికి నిత్య పూజలు జరుగుతున్నాయి. ఆగిరిపల్లి లక్ష్మీ నరసింహనగర్‌లోని గణేష్ ఉత్సవ కమిటీ, యాదవ బజార్‌లోని లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ, గన్నవరం రోడ్డులో గల కొత్తపేటలో బాల గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం నిమజ్జనాలు జరిగాయి. గణనాథులను ట్రాక్టర్‌లపై మేళతాళాలతో ఊరేగించి మెట్ల కోనేరులో నిమజ్జనం చేశారు.